వేస్ట్ ఎయిడ్ బాక్సులు

- ఆర్టీసీ బస్సుల్లో కనిపించని ప్రథమ చికిత్స కిట్లు
- ప్రమాదాలు జరిగితే బస్సునే ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వాసుపత్రుల నుంచి కిట్ల సరఫరా
- కూటమి ప్రభుత్వం వచ్చాక సరఫరా నిలిపివేత

'కోసిగి మండలం అగసనూరుకు తాయప్ప ఇటీవల ఆదోని నుంచి కర్నూలుకు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నాడు. చివరి నుంచి మూడో వరుసలో కూర్చున్నాడు. రాళ్లదొడ్డి వద్ద బస్సు కుదుపునకు గురైంది. బస్సు కిటికీవద్ద రేకుకు బలంగా తగలడంతో తలకు గాయమైంది. రక్తస్రావం కావడంతో ప్రయాణికులంతా ఫస్టుఎయిడ్ బాక్సువైపు చూశారు. బాక్సు ఉంది గానీ అందులో మందుల కిట్టులేదు. ఇదేమిటయ్యా అని కండక్టర్‌ను ప్రశ్నిస్తే చాలాకాలమైంది సారు అందులో మందుల్లేక అంటూ సమాధానమిచ్చాడు. బస్సును గోనెగండ్లలో ఆపి ఓ ఆర్ఎంపీ దగ్గర తాయప్ప తలకు కట్టుకట్టించారు.' ఇది ఒక్క తాయప్ప సమస్యో లేక ఒక్క డిపో సమస్యోకాదు. మొత్తం ఆర్టీసీలో నిర్వీర్యమవుతున్న సేవలకు నిదర్శనం. ఫస్టుఎయిడ్ కిట్ల పంపిణీపై యాజమాన్యం, కూటమి ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి పరాకాష్ట అంటూ సంస్థ మాజీ ఉద్యోగులే గగ్గోలు పెదవివిస్తున్న పరిస్థితి.

ఎమ్మిగనూరు: 'ఆర్టీసీ మీది..మాది..మనందరిదీ .. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం' అంటూ ఒకపక్క ప్రభుత్వం.. మరోపక్క ఆర్టీసీ యాజమాన్యం ఊకదంపుడు ప్రచారాలు చేస్తూనే ఉన్నారు. అయితే ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స అందించే ఫస్టు ఎయిడ్ బాక్స్‌లు బస్సుల్లో కనుమరుగయ్యాయి. పేరుకే ఫస్టు ఎయిడ్ బాక్సులంటూ బస్సులో ఉంటాయిగానీ అందులో ఎటువంటి మందులుండవు.

చెత్త బాక్సులుగా..

ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో 90 బస్సులు నిత్యం నడస్తున్నాయి. ఇందులో 74 సర్వీసులు సంస్థకు చెందినవి, 16 హెయిర్ సర్వీసులు. బస్సులో ఉన్న ఫస్టు ఎయిడ్ బాక్సుల్లో అయోడిన్, కాటన్, టించర్, టేపు, కత్తెర, ఇతర మందులు, చికిత్స పరికరాలు ఉంచాలి. ఇందులో ఏ ఒక్కటీ కనిపించవు. అయితే డిపోలో పల్లె వెలుగుల తోపాటు ఇతర సర్వీసుల్లోనూ ఫస్టు ఎయిడ్ కిట్లు మచ్చుకైనా కనిపించవు. కొన్నింట్లో బాక్సులే కనుమరుగయ్యాయి. ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ల్లో క్లీనింగ్ దుస్తులు, వేస్టు పేపర్లు దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు జరిగినపుడు సమీప పట్టణాల్లోని ఆసుపత్రులకో లేక జిల్లా కేంద్రంలోని పెద్దాసుపత్రికో ఆర్టీసీ బస్సునే తీసుకెళ్లాల్సిన పరిస్థితులు తరచుగా జరుగుతుంటాయి. పెద్ద ప్రమాదాలైతే 108కు ఫోన్ చేయాల్సిందే.

నిధులు కేటాయించని ప్రభుత్వం

ఆర్టీసీ ఆదాయం పెంచుకోవాలని ఒకవైపు ఆర్టీసీ.. ప్రయాణికులపై సెస్ పేరుతో అదనపు బాదుడు వేస్తున్నప్పటికీ వారి క్షేమాన్ని పూర్తిగా విస్మరించాయి. రాష్ట్ర ప్రభుత్వం కనీసం బస్సుల్లో ఫస్టుఎయిడ్ కిట్లను కూడా సరఫరా చేయకపోవటం పట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమానికీ ఆర్టీసీ బస్సులను అప్పనంగా ఉపయోగించుకుంటూ ఆర్టీసీని మరింత అప్పుల ఊబిలోకి లాగుతుందే తప్పా చేయూత మాత్రం కనిపించడం లేదనీ ఓ ఉద్యోగి వాపోయాడు. ఫస్టు ఎయిడ్‌కిట్లకు ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులు కేటాయింపులేదని ఆర్టీసీ ఉద్యోగులు చెబుతున్నారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి మందుల సరఫరా ఉండేదనీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అవికూడా రావడంలేదని పేర్కొంటున్నారు. అటు ప్రభుత్వం గానీ, ఇటు ఆరోగ్యశాఖ గానీ, రవాణా శాఖ నుంచి గానీ ఎటువంటి స్పందలేదని వివరిస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ప్రతి ఆర్టీసీ బస్సుల్లో ఫస్టు ఎయిడ్ బాక్సులు ఏర్పాటుచేసి, మందులను సరఫరా చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఎమ్మిగనూరు ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిచిన బస్సులు (ఇన్‌సెట్) ఓ బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్సు దుస్థితి

ఆర్టీసీని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేస్తోంది. అన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు ఆర్టీసీ బస్సులనే వినియోగిస్తూ ఆర్టీసీకి నష్టం చేకూర్చుతోంది. బస్సుల్లో ఫస్టుఎయిడ్ కిట్లు, వినోద సౌకర్యాలు ఉండవు. కానీ ప్రయాణికులపై వినోద చార్జీలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

– వీరేష్‌యాదవ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు

రోడ్ల మరమ్మతులో నిర్లక్ష్యం వీడాలి

ఆదోని రూరల్: రోడ్లను మరమ్మతు చేయడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సీపీఎం పార్టీ నాయకులు తిక్కప్ప, పరమేష్, అమరేష్, ఐజాక్ నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం వారు అధ్వానంగా ఉన్న రోడ్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ముఖ్యంగా ఆదోని నుంచి సిరుగుప్పకు వెళ్లే రహదారిలో గుంతలను పూడ్చంలో ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రహదారులపై గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చి వేసి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నేడు ధర్నా

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ బిల్లులు పెంచడాన్ని నిరసిస్తూ సోమవారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, సంబంధిత అధికారులకు వినతి పత్రం ఇవ్వనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా విద్యుత్ కార్యాలయానికి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు పార్టీ కార్యాలయం వద్దకు పార్టీ మాజీ రాష్ట్ర, జిల్లా, కార్పొరేషన్ల చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తునా తరలి రావాలని కోరారు.

క్లుప్తంగా

అంకితభావంతో పనిచేయాలి


పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఈఓ-2 శ్రీనివాసులు

ఆదోని సెంట్రల్: వృత్తి పట్ల అంకితభావంతో పని చేసినప్పుడే ప్రజల మన్ననలను పొందుతామని మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పదవీవిరమణ కార్యక్రమం జరిగింది. ఎంఈఓ మాట్లాడుతూ పిల్లలను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడానికి దేవుడు మనకు ఇచ్చిన గొప్ప వరమన్నారు. పిల్లల పట్ల మనం చూపిన ప్రేమ అప్యాయతలను వారు ఎప్పుడు గుర్తించుకుంటారని తెలిపారు. 35 సర్వీస్‌లో వెంకటేశ్వర్లు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం వెంకటేశ్వర్లు దంపతును సన్మానించారు. కార్యక్రమంలో పదవీవిరమణ పొందిన హెచ్ఎం శివణ్ణ, ఎల్‌కే చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



పెద్దనేలటూర్‌లో భగవద్గీత ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

గోనెగండ్ల : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కోటకొండ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్తీక మాసం చివరి రోజును పురస్కరించుకుని ఆదివారం మండలంలోని పెద్దనేలటూర్ గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. సమితి అధ్యక్షుడు రంగస్వామి మాట్లాడుతూ కార్తీక మాసంలో దీపారాధన యోగాసాధనకు గుర్తు అని, ఆదివారం సృష్టి మొదలుకు గుర్తు అని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రామానాయుడు, శేఖర్, భావన, జగదీష్, శీను పాల్గొన్నారు.

దర్గాలో అమావాస్య వేడుకలు


దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఆదివారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలను నిర్వహించారు. ఆదివారం అమావాస్య కావడంతో భక్తులు శనివారం సాయంత్రం నుంచే తరలి వచ్చారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు.


ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న సీఐ, న్యాయవాదులు

ఆదోని రూరల్: ఎయిడ్స్ పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని భీమాస్ సర్కిల్‌లో న్యాయవాదుల సహకారంతో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ అక్రమ సంబంధం, జాగ్రత్తలు తీసుకోకుండా రక్త మార్పిడి చేయడం, ఒకరికి వేసిన సిరంజీలు మరొకరి వేయడం వల్ల ఎయిడ్స్ సోకే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీప్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు, న్యాయవాదులు లోకేష్‌కుమార్, ఆనంద్, బాలకృష్ణ, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బీసీ హాస్టల్ వార్డెన్ మృతి


సుబ్బయ్య(ఫైల్)

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో వార్డెన్‌గా పని చేస్తున్న సుబ్బయ్య(62) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. భార్య మహాలక్ష్మి, సిబ్బంది తెలిపిన వివరాల మేరకు ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. కర్నూలులోని అస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. అయితే ఆయన ఈనెల 31న పదవీ విరమణ చేయాల్సి ఉంది. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పైరయ్యస్వామికి ప్రత్యేక పూజలు

- నేడు రథోత్సవం


ఆంజనేయస్వామికి వెండితోక విరాళంగా ఇస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలో వెలసిన పైరయ్య ఆంజనేయస్వామికి అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం పాడ్యమి రోజున ఉదయం భీమసేన వెండి అలంకారములో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం శ్రీ సీతారామ లక్ష్మణస్వామి వారితో రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు రామకృష్ణస్వామి తెలిపారు. ఉదయం 7గంటలకు శోభయాత్ర ఉంటుందని చెప్పారు.

వెండి విరాళం

పైరయ్యస్వామి రథోత్సవం సందర్భంగా పత్తికొండ పట్టణానికి చెందిన జగన్నాథ్ కుటుంబసభ్యులతో కలసి ఆంజనేయస్వామి వారికి ఒక కేజీ (రూ.1.1లక్షతో) వెండితో ఆభరణాలు చేయించి ఆదివారం ప్రధాన అర్చకులు రామకృష్ణకు అందజేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలను జగన్నాథ్‌కు అందించి పూలమాలతో సత్కరించారు.

మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వాలి



మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న మసీదు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు షేక్ అల్లాబకాష్, షేక్ జక్రియ

ఆదోని అర్బన్: స్వయం ఉపాధి కోసం కుట్టు శిక్షణ పొందిన మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయాలని ఆదోని దూల్హా పైల్వాన్ మసీదు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అల్లాబకాష్, షేక్ జక్రియ కోరారు. ఆదివారం మసీదు మైదానంలో దుల్హాపైల్వాన్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన 180 మంది మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ శిక్షణ కేంద్రంలో కులమతాలకు అతీతంగా ముస్లింలు, హిందువులు శిక్షణ పొందుతున్నారన్నారు. త్వరలోనే మసీదు కమిటీ ఆధ్వర్యంలో నర్సింగ్ సెంటర్, అలాగే ఉన్నత విద్య, ఉపాధి కోసం కూడా శిక్షణ కేంద్రాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖతిబ్‌సాబ్ జునైద్ హస్మి, మసీదు కమిటీ ఉపాధ్యక్షులు ఖాదర్‌బాషా, కమిటీ సభ్యులు గౌస్ మహమ్మద్, మసీదు ఇమామ్‌సాబ్, ఆఫీజ్‌మున్నావర్ సాబ్, దాదాబాష తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

ఆదోని సెంట్రల్: సెలవుల్లో తరగతులను నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తరగతులను నిర్వహిస్తున్నాయన్నారు. తద్వారా విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సంతోష్, శిధర్, ప్రతాప్, యశ్వంత్, మధు, సూరి తదితరులు పాల్గొన్నారు.

4న గవి వీరయ్యస్వామి ఆరాధన మహోత్సవం

ఆదోని అర్బన్: పట్టణంలోని బసాపురం రోడ్డులోని వ్యవసాయ మార్కెట్‌యార్డు గేటు సమీపంలోని మఠంలో వెలిసిన శ్రీ గవి వీరయ్యస్వామి వారి 96వ ఆరాధన మహోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు మఠం ధర్మకర్త శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి వేకువజాము నుంచి ధ్వజారోహణ పూజలు, పంచామృతాభిషేకం, మహా మంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

పౌరుడికి రాజ్యాంగం ఒక కరదీపిక


మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి గోవిందు

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి పౌరుడికి రాజ్యాంగం ఒక కరదీపిక లాంటిదని సీపీఎం మండల కార్యదర్శి గోవిందు, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు నాగమణి అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో రాజ్యాంగ లక్ష్యాలు, దాని ప్రాముఖ్యత అన్న అంశంపై కేవీపీఎస్ మండల కార్యదర్శి తిమ్మన్న అధ్యక్షతన సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రతి కులానికి వారి పవిత్ర గ్రంథాలు ఎలాగానో ప్రతి ఒక్కరికి భారత రాజ్యాంగం అలాంటిదన్నారు. నేడు దేశాన్ని పాలిస్తున్న పాలక ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. మద్యపాన నిషేదం అనేది రాజ్యాంగంలో ఒక నిర్ణయమని అయితే నేటి ప్రభుత్వాలు మద్యాన్ని ఒక ఆర్థిక వనరుగా మార్చేశాయని విమర్శించారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు దేవేంద్రబాబు, ఎంపీజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖదీర్, కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఖాసింవలి పాల్గొన్నారు.

బాబు షూరిటీకి లేదు గ్యారెంటీ

- ట్రూఅప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వ బాదుడు
- ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడం దారుణం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక



ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన షూరిటీకి ఎలాంటి భవిష్యత్, కానీ గ్యారెంటీ కానీ లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు మభ్యపెట్టి ఉత్తుత్తి వాగ్దానాలతో గద్దెనెక్కిన తరువాత ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీల భారం ప్రజపై మోపడం దారుణమన్నారు. సంపద సృష్టించడం మాట పక్కన పెట్టి రెండు సార్లు ట్రూఅప్‌చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలను పెంచారని విమర్శించారు. ఆరు నెలల పాలనలో రూ.15,485.36 కోట్ల భారం రాష్ట్రంలోని ప్రజలపై భారం మోపి చంద్రబాబు బాదుడుకు అంబాసిడర్‌గా పేరు సంపాదించారన్నారు. రానున్న రోజుల్లో ఒక యూనిట్‌కు రూ.0.92పైసలు మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. గత దీపావళి నాటికి ప్రజలపై రూ.6వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని మోపిన కూటమి ప్రభుత్వం మళ్లీ రెండు నెలల్లోనే రూ.2.19పైసల చొప్పున విద్యుత్ చార్జీలు పెంచేందుకు పూనుకుందని విమర్శించారు. 2025–26 సంవత్సరానికి గాను విద్యుత్ సంస్థలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.

సౌర విద్యుత్ ఒప్పందాలపై దుష్ప్రచారం..

సౌర విద్యుత్ ఒప్పందాలలో కూడా సీఎం చంద్రబాబు ప్రభుత్వం 2400మెగా వాట్ల కోసం చేసుకొన్న ఒప్పందం సగటున రూ.5.90పైసలైతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో కేవలం రూ.2.49 పైసలు మాత్రమేనని స్పష్టం చేశారు. దీన్ని బట్టి చూస్తే ప్రజలపై భారం మోపిందెవరో ప్రజలే గుర్తిస్తారన్నారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన, స్కాలర్‌షిప్‌లు ఇవ్వక పోవడంతో నేడు విద్యార్థులు చదువుల కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

హాస్టల్ సమస్యల పరిష్కారానికి చర్యలు


హాస్టల్ వెనుక నిల్వ వున్న డ్రైనేజీ నీటిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ నిత్యానందరాజుతో కలిసి హాస్టల్‌ను తనిఖీ చేశారు. ముందుగా హాస్టల్ చుట్టు ఉన్న పరిసరాలను పరిశీలించారు. హాస్టల్ అపరిశుభ్రంగా ఉండడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. రోజు వారీగా హాస్టల్ పరిసరాలు పరిశుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్డీ హారూన్ రషీద్‌కు సూచించారు. హాస్టల్ పరిసరాలలోకి మందుబాబు రాకుండా పెట్రోలింగ్ చేయాలని ఎస్ఐ చంద్రమోహన్‌కు ఆదేశించారు. హాస్టల్‌లోపల బాత్‌రూమ్స్, టాయిలెట్స్ నిండి పోయి నీటి సరఫరా లేక దుర్వాసన వెదజల్లడంపై హాస్టల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగు నీటి సరఫరా లేక పోవడం, స్నానాలు కూళాయిలు సరిపోవడం లేదని విద్యార్థులు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ, ఆర్ఐ శ్రీరాములు, ఎస్ఐ చంద్రమోహన్, వీఆర్వోలు, ఉన్నారు.

జనవరి 5న హిందూ శంఖారావం

కోసిగి: జనవరి 5వ తేదీన విజయవాడలో నిర్వహించే హిందూ శంఖారావం కార్యక్రమానికి హిందువులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నాయకులు రంగస్వామి, కోదండ రామయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిద్దరూఢ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, ఏబీవీపీ కార్యకర్తలతో కలిసి హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ హిందువులు అందరు ఐక్యమత్యంతో ముందడుగు వేసి మన దేవాలయాలను మనమేసంరక్షించుకుందామన్నారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు.

ఉరుకుందలో లక్ష పుష్పార్చన పూజలు


స్వామికి పూజల్ని చేపడుతున్న అర్చకులు


ఊరేగింపుగా పూజలను తీసుకొస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి సన్నిధిలో అమావాస్య సందర్భంగా లక్ష పుష్పార్చన పూజలు చేపట్టారు. ఆదివారం అమావాస్య కలిసి రావడంతో శనివారం సాయంత్రం నుంచే స్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చి అమావాస్య వేడుకల్లో పాల్గొన్నారు. దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహా మంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. భక్తులు పిండివంటలు వండి స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి అమావాస్యకు లక్ష పుష్పార్చన చేపడుతున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. పాల్గొనలనుకున్న భక్తులు తమ పేర్లను ముందుగానే దేవాలయ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే మండలంలోని బుదుములదొడ్డి ఆంజినేయస్వామి ఆలయం, తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు అధికంగా తరలివచ్చారు.

కౌతాళంలో అభివృద్ధి పనులు


బస్టాండులో రోడ్డు చదును చేస్తున్న దృశ్యం


ఆదోని రోడ్డులో సైడ్ కాలువ పూడికతీత పనులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. బస్టాండు ముందు గుంతలుగా ఉన్న ప్రాంగణాన్ని చదును చేయడంతో పాటు గ్రావెల్ వేసి గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బాలనాగిరెడి సహకారంతో పూర్తి చేసినట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. అలాగే కస్తూర్బా గాంధీ పాఠశాల నుంచి జెడ్పీ పాఠశాల వరకు వర్షపు నీరు రోడ్డుపై రాకుండా జేసీబీతో సైడ్ కాలువలను తీయించినట్లు వెల్లడించారు. దీంతో ఆర్అండ్‌బీ రోడ్డు దెబ్బతినకుండా ఉంటుందని, గ్రామంలో ఇలాంటి అభివృద్ధి పనులను ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి నిరంతరం పాటుపడతామన్నారు. ఇప్పటికే వైఎస్సాఆర్ నగర్‌లోని మూడు రోడ్డుల్లో డ్రైనేజీ నిర్మాణంతో పాటు సిమెంటు రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు.

గురజాలలో వైభవంగా అమావాస్య వేడుకలు


తుంగభద్ర తీరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


గురజాల ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పురోహితులు, భక్తులు

నందవరం : మండలంలో భక్తులు కార్తీక అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం కార్తీక మాసంలో చివరి రోజు, అమావాస్య కావడంతో భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిటాలాడియి. ఓం నమఃశివాయ నామస్మరణ మారుమోగింది. ప్రముఖ శైవ క్షేత్రం, దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో కార్తీక అమావ్యాస వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం కార్తీక అమావాస్య పురస్కరించుకుని ఆది దంపతులకు పురోహితులు హంపేష్ స్వామి జలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం తుంగా తీరం భక్తజన సంద్రంగా మారింది. భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఇసుకతో లింగాల ప్రతిమలను తయారు చేసి విశిష్ట పూజలు చేపట్టారు. కార్తీక దీపాలు వెలిగించి నదీమ్మ తల్లికి అర్పించారు. రామలింగేశ్వర స్వామి దర్శనానికి క్యూలైన్లలో భక్తులతో కిక్కిరిసింది. భక్తులు ఆదిదంపతుల(రామలింగేశ్వరస్వామి, పార్వతీదేవి)ను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాగణంలో ఉసిరి వృక్షం చుట్టు దీపాలు వెలిగించి ప్రదక్షణలు చేశారు. గురజాల క్షేత్రంలో గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నరసింహారెడ్డి, శివారెడ్డి, గ్రామ సర్పంచ్ వీరస్వామి, పరమేష్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణంలోని గంగాభవనీ దేవాలయంలో ఆదివారం అమావాస్య పూజలు, కార్తీక మాస ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముందుగా శ్రీ గంగాభవానీమాతకు పాలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకు పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. గంగపుత్ర సంఘం నాయకులు తెలుగు ఈరన్న, ఆటో వెంకటేష్, మేఘనాథ్, నాగరాజు, బేల్దారు శ్రీనివాసులు, గోపి, నరేష్ పాల్గొన్నారు.